క్లుప్తంగా

నేడు లోక్‌సత్తా ఆధ్వర్యంలో సదస్సు

మోతీనగర్: లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అబిడ్స్‌లోని సురేఖ కాంప్లెక్స్‌లో ధన రాజకీయాలు పోవాలి జన రాజకీయాలు రావాలి అనే సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు వంశీప్రసాద్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ఎన్.జయప్రకాష్ నారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాస్వామ్య వాదులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయ నగర్ కాలనీలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగిన తర్వాత మొదటి శనివారం కావడంతో ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పాండుగౌడ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మున్నా, బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, ప్రకృతి రాము, జిల్లా గోపాల్, చక్రి, రమేష్ తదితరులు హాజరయ్యారు.

కృష్ణవేణి హైస్కూల్ వార్షికోత్సవం



ఓల్డ్‌బోయినపల్లి: ఓల్డ్‌బోయినపల్లి అస్మత్‌పేట్‌లోని కృష్ణవేణి హైస్కూల్ వార్షికోత్సవం అశోక గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దుండుగుల యాదగిరి, మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతి, బీజేవైఎం స్టేట్ కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బారినుంచి ప్రజల రక్షణకు చర్యలు

దుండిగల్: వీధి కుక్కల బారినుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం దుండిగల్‌లో బ్లూ క్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో 20 కుక్కలను పట్టుకున్నారు. కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. వీధి కుక్కల నివారణ చర్యల్లో భాగంగా బ్లూ క్రాస్ సొసైటీతో ఒప్పందం చేసుకున్నామని, వారు వీధి కుక్కలను తీసుకెళ్లి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్, యాంటి రేబీస్ టీకా వేసి దూర ప్రాంతాల్లో వదిలి పెడతారన్నారు. వేసవి కాలంలో కుక్కలు డీహైడ్రేషన్ కారణంగా వింతగా ప్రవర్తిస్తాయని, వాటికి కావాల్సిన తాగు నీరు, ఆహారాన్ని పిల్లలు తిరగని ప్రదేశాల్లో ఉంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల క్రిష్ణయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.కరుణాకర్ రెడ్డి, సాత్విక్, బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నూతన దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రూపా శ్రీకౌంటీ కాలనీ ఎదురుగా నూతనంగా నిర్మించ తలపెట్టిన అభయాంజనేయ స్వామి దేవాలయం, అష్టలక్ష్మి దేవాలయ నిర్మాణాలకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్ రెడ్డి, బోయిని బాలమణి బాలరాజు,నవనీత జగదీశ్, బిజిలి రాజు, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, యునుస్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, మహిపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొల్లూరి యాదగిరి, ఆంజనేయులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఏర్పాటు సరే.. నిర్వహణేది..?



మాధవరం కాలనీలో నిరుపయోగంగా ఉన్న మైల్డ్ స్టీల్ బయో టాయిలెట్స్

- నిరుపయోగంగా మారుతున్న మైల్డ్ స్టీల్ బయో టాయిలెట్స్
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసర ప్రాంతాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్స్



ఆస్‌బెస్టాస్ కాలనీ నాలా వద్ద నిరుపయోగంగా..

ఆల్విన్‌కాలనీ: నగరంలో పరిశుభ్రత లోపించకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాంతాల్లో మైల్డ్ స్టీల్ బయో టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసింది. అయితే నిర్వహణ లోపంతో అవి అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. వినియోగించుకునేందుకు ఈ టాయిలెట్స్ అనువుగా లేకపోవడంతో ప్రజలు బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్, మాధవరం కాలనీ, దీనబంధు కాలనీ, ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ తదితర ప్రాంతాల్లో మూడు సంవత్సరాల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు జన సంచారం ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహణను గాలికి వదిలేయడంతో వాటిల్లోని సామగ్రిని దొంగలు తీసుకెళ్లారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే నిర్వహణ బాగుంది. మిగతా చోట్ల ఈ టాయిలెట్స్ పనికి రాకుండాపోయాయి. మరికొన్ని చోట్ల టాయిలెట్స్‌ను ఉపయోగించుకోవడానికి అనువుగా ఉన్నప్పటికీ నిర్వాహకులు వాటికి తాళాలు వేసి ఉంచుతున్నారు.

- నగరంలో అన్ని రకాల వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి మైల్డ్ స్టీల్ బయో టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసింది. అయితే అవి మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. ప్రజాధనం దుర్వినియోగం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్స్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలు కోరుతున్నారు.
- పాపిరెడ్డినగర్, హుడా పార్కులోని షటిల్ కోర్టులో మైల్డ్ స్టీల్ బయో టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు వాటిని అక్కడి నుంచి మాయం చేశారు.
- మాధవరం కాలనీలో నాలా పక్కన ఏర్పాటు చేసిన టాయిలెట్స్‌ను అక్కడి నుంచి తీసేసి పక్కన పడేశారు.
- ఆస్‌బెస్టాస్ కాలనీ లక్కీ బార్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మైల్డ్ స్టీల్ బయో టాయిలెట్స్ నిర్వహణ లోపంతో పనికిరాకుండా పోయాయి.
- దీనబంధు కాలనీ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్స్‌కు తాళాలు వేసి ఉంచడంతో అవి నిరుపయోగంగా మారాయి. కార్మికులు, ప్రయాణికులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో మరుగుదొడ్లు వాడుకునే విధంగా లేకపోవడంతో ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తున్నారు.

కూకట్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



బాలాజీనగర్ డివిజన్‌లో ఓ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వివిధ పార్కులను శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్న మాదిరిగా నగరంలో ఎక్కడా పార్కులు అభివృద్ధి చెందడం లేదని, ఇందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞత తెలిపారు. భవిష్యత్తులో కూకట్‌పల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, డివిజన్‌ల అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, నాయకులు సాయిబాబాచౌదరి, అడుసుమిల్లి వెంకటేశ్వర రావు, శ్యామల రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో 144 మంది లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. పేదింటి ఆడబిడ్డల ఆర్థిక సహాయం చేసి సీఎం వారికి అండగా నిలుస్తున్నారన్నారు. కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మహేశ్వరి శ్రీహరి, సబిహాబేగం, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కాలనీలు, మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ అధికారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

- జీడిమెట్ల డివిజన్ గ్రీన్ పార్క్‌లో చేపడుతున్న ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని ఆలయ కమిటీ ప్రతినిధి జ్యోతి, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీదేవిరెడ్డి, స్థానిక మహిళలు విషయమై శంభీపూర్ రాజును కోరారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.
- సూరారం, గాజులరామారం డివిజన్‌ల పరిధిలో నెలకొన్న సమస్యలను పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతి విషయంపై ఎమ్మెల్సీకి వివరించగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఆయన అన్నారు.

శోభకృత్ నామ సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న త్రిదండి రామానుజ జీయర్ స్వామి తదితరులు

కూకట్‌పల్లి: శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర తెలుగు కేలండర్‌ను అహోబిల త్రిదండి రామానుజ జీయర్ స్వామి ముచ్చింతల్‌లోని జీవ ఆశ్రమంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది పండుగ తెలుగు వారికి ప్రత్యేకమైన పండుగ అని, ఉగాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరూ శోభకృత్ నామ సంవత్సరంలో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డా.సత్యం శ్రీరంగం, కో చైర్మన్ ఇందుమతి, సుమేధ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే జన్మదిన శుభాకాంక్షలు



నర్సింగ్‌రావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే

ఓల్డ్ బోయిన్‌పల్లి: మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగరావు జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట్‌లోని చాముండేశ్వరి ఆలయం ఆవరణలో జరిగిన ఈ వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌గౌడ్ హాజరై నర్సింగ్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. అభిమానులు, కార్యకర్తల మధ్య జన్మదిన వేడుకలు చేసుకోవడం అభినందనీయమన్నారు.



వడగండ్లతో కూడిన వర్షం పడుతున్న దృశ్యం

కూకట్‌పల్లిలో వడగండ్ల వాన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వడగళ్లతో కూడిన వర్షం పడింది. దీంతో చిన్నారులు ఇంట్లో నుంచి బయటకు వచ్చి వడగళ్లను ఏరుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మబ్బులతో కూడిన వాతావరణం ఉండగా సాయంత్రం సమయంలో అరగంటకు పైగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు వడగండ్లు పడడంతో ప్రతి ఒక్కరూ సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. కూకట్‌పల్లి, జేఎన్‌టీయూహెచ్, భాగ్యనగర్‌కాలనీ, బాలానగర్, మూసాపేట, మోతీనగర్ తదితర ప్రాంతాల్లో వడగండ్లతో కూడిన వర్షం పడింది.

నేడు విద్యుత్ సమస్యలపై ప్రత్యేక క్యాంప్

జగద్గిరిగుట్ట: కరెంట్ బిల్లుల విషయంలో వినియోగదారుల సందేహాల నివృత్తి కోసం నేడు జగద్గిరిగుట్ట రాజీవ్ హిల్స్‌లో ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈఈ రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

జీడిమెట్ల: ఉచిత మెడికల్ క్యాంపులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి జీడిమెట్లలోని కొపల్లి ఫార్మా అగ్నిప్రమాద ఘటన సమయంలో ఘాటైన వాసనకు మోడీ అపార్ట్‌మెంట్ వాసులు అనారోగ్యం పాలయ్యారు. విషయం తెలుసుకున్న సురేష్‌రెడ్డి మల్లారెడ్డి ఆస్పత్రి చైర్మన్ బద్రారెడ్డితో చర్చించి మంత్రి మల్లారెడ్డి సహకారంతో మోడీ అపార్ట్‌మెంట్‌లో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. క్యాంపులో పాల్గొన్న డాక్టర్లు అపార్ట్‌మెంట్ వాసులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. ఇతర పరీక్షలు అవసరమున్న వారు మల్లారెడ్డి ఆస్పత్రికి వస్తే ఉచితంగా చేస్తామని చెప్పారు.

మహిళ అదృశ్యం



ఉషాదేవి(ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లో చోటుచేసుకుంది. ప్రశాంతినగర్‌కు చెందిన రాజేశ్వర్‌సింగ్ భార్య ఉషాదేవి(42) ఈ నెల 16న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన భార్యకు మతిస్థిమితం సరిగా లేదని ఉషాదేవి భర్త రాజేశ్వర్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రాధాపద్మజ

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధాపద్మజ మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసులు, ఉమెన్ సేఫ్టీ వింగ్ ద్వారా 8, 9 తరగతులకు చెందిన ఇద్దరిని సైబర్ అంబాసిడర్‌లుగా ఎంపిక చేసి వారికి అవగాహన కల్పించారని, అనంతరం వారు ఇతర విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బంధువులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చెయొద్దని, ఓటీపీలు ఇతరులకు చెప్పకూడదని, ఆన్‌లైన్ పెట్టుబడులు, ఫేక్ మ్యాట్రిమోని, ఆన్‌లైన్ లోన్లు, ఫేస్‌బుక్ ఫ్రెండ్‌షిప్, ఆన్‌లైన్ జాబ్స్ వంటి అనేక రకాల సైబర్ మోసాలకు ప్రజలు గురవుతున్నారని, సైబర్ వలలో పడకుండా ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వి.సుజాత, మోహన్‌రావు, శ్రీశైలం, సుధారాణి, ప్రేమ్‌కుమార్, రామ్‌చందర్, కిరణ్మయి, అనంతయ్య, వెంకటేశ్వర్, రాములు, సువర్ణ, సరోజ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

మోతీనగర్: ఆయుర్వేదిక్ చికిత్సతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని గవర్నమెంట్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఎర్రగడ్డ సూపరింటెండెంట్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మూసాపేట డివిజన్ పాండురంగనగర్ సంక్షేమ సంఘం, గవర్నమెంట్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఎర్రగడ్డ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుర్వేదిక్ వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. పూర్వకాలం వన మూలికలతో తయారు చేసిన వైద్యమే ఆయుర్వేద వైద్యం అని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదిక్ మందులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. వ్యాధి నయం కావడానికి సమయం ఎక్కువ పట్టినప్పటికీ శాశ్వతంగా నయం అవుతుందని తెలిపారు.